క్లుప్తంగా

ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలి

పాలకొండ రూరల్: దూర ప్రయాణాలు చేస్తున్నవారు ప్రయాణ సమయంలో తమ విలువైన వస్తువులను భద్రంగా ఉంచుకోవాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్‌ఐ ఎస్.ప్రశాంత్‌కుమార్ అన్నారు. ఆర్టీసీ, ప్రైవేట్ బస్సుల్లో దూర ప్రాంతాలకు ప్రయాణిస్తున్న వారికి మంగళవారం అవగాహన కల్పించారు. పరిచయం లేని సహచర ప్రయాణికులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇతరులు ఇచ్చే తాగునీరు, తినుబండారాలను స్వీకరించవద్దన్నారు. అనుమానితులను గుర్తిస్తే 100కు సమాచారం అందించాలని సూచించారు. ఈ క్రమంలో పాలకొండ, విశాఖ రహదారిలో వాహన తనిఖీలు చేపట్టి, నిబంధనలు అతిక్రమించిన వారికి అపరాధ రుసుము విధించారు.

పౌష్టికాహార ప్రాముఖ్యతను వివరించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కురుపాం: పౌష్టికాహార ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి కె.విజయగౌరీ సూచించారు. మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం పోషణ పక్వాడ పక్షోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. మార్చి 9 నుంచి 23 వరకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో పోషణ పక్వాడా పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేయాలని సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్లు భవాని, విజయగౌరీ, జానకి, గౌరమ్మ, శ్రావణి, సిబ్బంది ఆర్.భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

సీతంపేట: విద్యార్థులంతా బాగా చదివి ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించాలని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో మాటామంతి, బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం మంగళవారం జరిగింది. అంతర్ విశ్వవిద్యాలయ సాంస్కృతిక పోటీల్లో పాల్గొని, అంబేడ్కర్ విశ్వవిద్యాలయం తరపున ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. రాష్ట్ర స్థాయిలో థింసా నృత్య ప్రదర్శన పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిపిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. విద్యార్థులు తాగునీటి అవసరాల నిమిత్తం ఎమ్మెల్యే సొంత నిధులతో వాటర్ ప్యూరిఫికేషన్ మిషన్‌కు రూ.50 వేలు మంజూరు చేశారు. ఎంపీపీ ఆదినారాయణ, జెడ్పీటీసీ లక్ష్మి, సర్పంచ్ ఎ.కళావతి, ప్రిన్సిపాల్ శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

పాలకొండ రూరల్: రానున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని డిప్యూటీ ఈఓ పి.కృష్ణమూర్తి, ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని హెచ్‌ఎం మీసాల సూర్యనారాయణ అధ్యక్షతన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు సమయం వృథా చేయకుండా ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ప్రశాంతంగా పరీక్షలు రాయాలి

భామిని: విద్యార్థి దశలో కీలకమైన పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాల సాధన కోసం ఎటువంటి ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఎంపీడీఓ పి.కిశోర్‌కుమార్ సూచించారు. భామిని బాలికల గురుకుల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ కె.విజయలక్ష్మితో కలిసి పదో తరగతి విద్యార్థులకు మంగళవారం పలు సూచనలు చేశారు. ఈ నెల 18 నుంచి జరగనున్న పరీక్షలకు విద్యార్థులు ఎలా సన్నద్ధమయ్యారో పరిశీలించారు. సబ్జెక్ట్ వారీగా సమీక్షించారు. ఆయన వెంట గురుకుల టీచర్లు, విద్యార్థులు ఉన్నారు.

భూముల రీ సర్వేతో ప్రయోజనం

గుమ్మలక్ష్మీపురం: భూముల రీ సర్వేతో రైతుకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని లుంబేసు సర్పంచ్ తోయక సీతమ్మ అన్నారు. మండలంలోని మూలజమ్ము గ్రామంలో నాలుగో విడత రీ సర్వే కార్యక్రమాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడుతూ.. రైతుల భూములకు రక్షణ కల్పించేందుకు, భూమిపై వారికి శాశ్వత హక్కులు కల్పించేందుకు భూముల రీ సర్వే ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మండల సర్వేయర్ ఎస్.రమణమూర్తి, వీఆర్వో జి.భాస్కరరావు, బూత్ కన్వీనర్ తోయక మాధవరావు ఉన్నారు.

మాతాశిశు మరణాలు తగ్గించాలి

గరుగుబిల్లి: మాతాశిశు మరణాలను తగ్గించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఇన్‌చార్జ్ ప్రాజెక్టు డైరెక్టర్ వై.సత్యంనాయుడు అన్నారు. మండల వెలుగు కార్యాలయంలో గ్రామైఖ్య సంఘంలో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామైఖ్య సంఘ సభ్యులు ఇంటింటికి వెళ్లి గర్భిణులకు సక్రమంగా పౌష్టికాహారం అందించాలన్నారు. అంగన్‌వాడీల నుంచి అవసరమైన సామాగ్రిని అందించడం జరుగుతుందన్నారు. ఏపీఎం పి.అప్పలనాయుడు, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.


వీరఘట్టం: చిదిమిలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి నినాదాలు చేస్తున్న ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, వైఎస్సార్‌సీపీ అభిమానులు


పాలకొండ: దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్ తదితరులు


పాలకొండ రూరల్: ఎం.సింగుపురంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న ప్రజాప్రతినిధులు, ప్రజలు


భామిని: దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు

ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ లక్ష్యం

ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

ప్రజా సంక్షేమమే పరమావధిగా, అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భవించిందని ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశాల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జరుగుతున్న ప్రజా సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్


సీతంపేట: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే కళావతి

సరిహద్దు మాతా ఉత్సవాలకు ముందస్తు పూజలు

భామిని: ఆంధ్రా – ఒడిశా సరిహద్దు బత్తిలిలో వెలసిన సంతోషిమాత ఉత్సవాలకు ఆరంభ పూజలు మంగళవారం నిర్వహించారు. ఈ నెల 19 నుంచి 23 వరకు సంతోషిమాత 38వ వార్షికోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకోసం ముందస్తుగా బత్తిలి గ్రామ దేవతలకు చల్లదనం పేరున ఆరంభ పూజలు చేపట్టారు. ఆలయ ప్రధానార్చకులు రంపా తాతబాబు శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో మాతా సన్నిధిలో పూజలు చేశారు. అనంతరం గ్రామ దేవతల సన్నిధికి మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి చల్లదనం పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ భానుప్రసాద్ సాహు, వైస్ చైర్మన్ రాగోలు ఆశోక్, కార్యదర్శి ఎల్.సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.


ఊరేగింపుగా చల్లదనం పూజలకు తరలుతున్న భక్తులు

ఉత్సవ ఊరేగింపు

భామిని: మండలంలోని బాలేరులో వెలసిన శ్రీమల్లికార్జునుని ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేపట్టారు. గ్రామస్తులందరూ సమష్టిగా ఉత్సవాలను నిర్వహించారు. గ్రామ పెద్దల సారథ్యంలో ఉత్సవాల ఊరేగింపు నిర్వహించారు. సర్పంచ్ ప్రభాకర్ పాల్గొన్నారు.


ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

మహిళా సాధికారతే జగనన్న లక్ష్యం



మహిళలకు చేయూత చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

- చేయూత సభలో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: మహిళల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అగ్రతాంబూలం ఇచ్చి అన్ని సంక్షేమ పథకాలు వారి పేరిట అమలు చేశారని ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి అన్నారు. పెదమేరంగి కూడలిలో ఉన్న శ్రీసత్యకైలాస్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన వైఎస్సార్ చేయూత నాలుగో విడత కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మండలంలోని 31 పంచాయతీలకు చెందిన అర్హత ఉన్న మహిళలకు వైఎస్సార్ చేయూత నాలుగో విడత కింద ఒక్కొక్కరికి రూ.18,750 చొప్పున మొత్తం రూ.8.69 కోట్ల చెక్కును డీఆర్‌డీఏ సిబ్బంది సమక్షంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు 2014 సంవత్సరంలో డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత మోసం చేశారన్నారు. ప్రజా సంక్షేమానికి అహర్నిశలు కష్టపడుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మనమంతా అండగా నిలవాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికలలో వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.శశికళ, పార్టీ మండల కన్వీనర్ మూడడ్ల గౌరీశంకరరావు, వెలుగు మండల సమాఖ్య అధ్యక్షురాలు అల్లు ఉషారాణి, డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు, నాయకులు మరడాన కిశోర్‌కుమార్, బలగ వెంకటరమణ, అల్లు ఈశ్వరరావు, సర్పంచులు, ఎంపీటీసీలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే రహదారుల నిర్మాణం

సీతంపేట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే గిరిజన గ్రామాలకు పూర్తి స్థాయిలో రహదారుల నిర్మాణం జరిగాయని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని కడగండి గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దవంగరగూడ – పెదవంగర రోడ్డును ఆమె మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలకు పూర్తి స్థాయిలో రహదారులు నిర్మించడంతో అటవీ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించాలన్నా, ఆస్పత్రులకు రోగులను తీసుకువెళ్లాలన్నా కష్టాలు తొలగాయన్నారు. అలాగే మంచినీరు, విద్యుత్ సౌకర్యం వంటివి అన్ని గ్రామాలకు కల్పించామన్నారు. రానున్న వేసవిలో మంచినీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎస్.లక్ష్మి, పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి

రైతు ఉత్పత్తిదారుల నూతన భవనం ప్రారంభం


భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి, పీఓ కల్పనాకుమారి

సీతంపేట: ఐటీడీఏ ఆవరణలో నిర్మించిన రైతు ఉత్పత్తిదారుల నూతన భవనాన్ని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి మంగళవారం ప్రారంభించారు. రైతులు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గిరిజనులు పండించిన అటవీ ఉత్పత్తులు ఇక్కడ నిల్వ చేసుకోవాలన్నారు. అనంతరం గిట్టుబాటు ధరలు వచ్చినప్పుడు విక్రయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆదినారాయణ, జెడ్పీటీసీ లక్ష్మి, ఏఎంసీ చైర్మన్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు

గుమ్మలక్ష్మీపురం: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు రక్తహీనత బారిన పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎంపీడీఓ జి.జగదీష్‌కుమార్ అన్నారు. ప్రిజమ్ 10 కార్యక్రమంలో భాగంగా మండలంలోని నెల్లికిక్కువ గ్రామంలోని గర్భిణులు, బాలింతల ఇళ్లకు వెళ్లి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలపై ఆరాతీశారు. పౌష్టికాహారం సక్రమంగా అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే దత్తత తీసుకున్న సచివాలయం సిబ్బంది ఇంటికి వచ్చి ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్నదీ లేనిదీ కేర్‌షీట్‌ను చూసి పరిశీలించారు. మాత శిశు మరణాలు జరుగకుండా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని, అందుకు అనుగుణంగా సచివాలయం, వైద్య ఆరోగ్య సిబ్బంది పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఆరోగ్య సురక్ష శిబిరం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని నెల్లికిక్కువలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన రోగులకు దుడ్డుఖల్లు పీహెచ్‌సీ వైద్యులు వైద్య సేవలందించారు. ఎంపీడీఓ జి.జగదీష్‌కుమార్ శిబిరంలో అందిస్తున్న వైద్య సేవలను పర్యవేక్షించారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషిచేయాలి

గరుగుబిల్లి: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు కృషిచేయాలని ఎంఈఓ ఎస్.నాగభూషణరావు సూచించారు. మండలంలోని ఉల్లిభద్ర జెడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. పదోతరగతి విద్యార్థులకు పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకునేందుకు అవసరమైన సూచనలు, సలహాలు అందించారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు.

సంక్షిప్తంగా...

నేడు మండల సర్వసభ్య సమావేశం

సీతంపేట: మండల సర్వసభ్య సమావేశం స్థానిక వైటీసీలో బుధవారం జరగనున్నట్టు ఎంపీడీఓ కె.గీతాంజలి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు. అధికారులు సంబంధిత శాఖల సమాచారంతో హాజరు కావాలని కోరారు.

గ్రామాల్లో పోలీసు కవాతు

పాలకొండ: ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్ర బలగాలు గ్రామాల్లో కవాతు నిర్వహిస్తున్నాయి. మండలంలోని కొండాపురం గ్రామంలో సీఐ చంద్రమౌళి ఆధ్వర్యంలో మంగళవారం కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి గ్రామం భౌగోళిక స్వరూపం, అక్కడి పరిస్థితులపై ప్రత్యేక బలగాలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఆయనతో పాటు ఎస్‌ఐ ప్రశాంత్‌కుమార్ ఉన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం రేపు

గరుగుబిల్లి: మండలంలోని రావుపల్లిలోని శ్రీసత్యసాయిబాబా మందిరం ప్రాంగణంలో డా.వైఎస్సార్ కంటి వెలుగు పథకం, శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆశయ హెల్పింగ్ హేండ్స్ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంటి సమస్యలున్నవారు ఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ పాస్‌బుక్, ఫోను నంబర్‌ను తీసుకొని రావాలన్నారు. మరిన్ని వివరాలకు 99592 30709, 99661 18941 నంబర్లను సంప్రదించాలని కోరారు.

163 మందికి కంటి పరీక్షలు

వీరఘట్టం: స్థానిక సత్యసాయి సేవా సమితిలో ప్రగతి సేవా సొసైటీ బద్దుమాసంగి వారి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో ఆప్తాలమిస్ట్ ఎస్.రత్నంరాజు 163 మందికి కంటి పరీక్షలు చేసినట్లు సొసైటీ అధ్యక్షుడు పైల హరిబాబు తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ వారి సౌజన్యంతో నవజీవన్–తిరుపతి వారి ఆర్థిక సాయంతో నిర్వహించిన ఈ శిబిరంలో 72 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశామన్నారు. వీరికి రెండు విడతలుగా బుధ, గురువారాల్లో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో ఆపరేషన్లు చేస్తామన్నారు. కంటి పరీక్షలకు వచ్చిన వారందరికీ సత్యసాయి భక్తులు పులిహోర అందజేశారు.

ఆస్తి పన్నుపై వడ్డీ మాఫీ వివరించండి

పాలకొండ: ఆస్తి పన్ను చెల్లింపులపై ప్రభుత్వం కల్పించిన వడ్డీ మాఫీపై ప్రజలకు అవగాహన కలిగించాలని నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు సూచించారు. పట్టణంలోని సచివాలయాల సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తి పన్ను వసూళ్లకు మంచి అవకాశం ఉందని తెలిపారు. శత శాతం పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. ఈ నెల 31లోగా పన్నులు చెల్లించిన వారికి వడ్డీ మాఫీ చేస్తున్నారని తెలిపారు. ఆ విషయం ప్రజలకు తెలియజేసి పన్నులు చెల్లించేలా అవగాహన కలిగించాలని సూచించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

గరుగుబిల్లి: రోజురోజుకు పెరిగిపోతున్న సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డా.వైఎస్సార్ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డా.బి.ప్రసన్నకుమార్ అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'మన గ్రామం- మన విశ్వవిద్యాలయం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని సంతోషపురంలో మంగళవారం అక్షరాస్యత, డిజిటల్ ఇండియాపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ డిజిటల్ చెల్లింపులు, సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎ.తవిటినాయుడు, కె.రవీంద్ర, కార్యదర్శులు చరణ్ పండిత్, రాజేష్, వీఆర్ఓ రామకృష్ణ, ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డా.హరిరామకుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ – జనసేన పొత్తుతో మహిళల భద్రతకు ముప్పు

వీరఘట్టం: టీడీపీ – జనసేన పొత్తుతో మహిళల భద్రతకు ముప్పు అని వీరఘట్టం జెడ్పీటీసీ జంపు కన్నతల్లి అన్నారు. టీడీపీ-జనసేనకు చెందిన సోషల్ మీడియా సైకోల వల్లే వివాహిత గీతాంజలి మృతి చెందిన విషయం తెలిసిందే. మంగళవారం వీరఘట్టం మండలం కత్తులకవిటిలో గీతాంజలి మృతికి జెడ్పీటీసీ కన్నతల్లితో పాటు గ్రామ సర్పంచ్ గేదెల సరోజనమ్మ, ఎంపీటీసీ కొత్తవలస పరిమళ, మహిళా సంఘాలు తమ సంతాపం తెలిపారు. అనంతరం జెడ్పీటీసీ కన్నతల్లి మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గీతాంజలి తనకు జరిగిన లబ్ధిని, ఆమె పొందిన ప్రభుత్వ పథకాలను తెలియజేస్తే తప్పా... ఆడవాళ్లకు స్వేచ్ఛగా మాట్లాడే హక్కు లేదా అని కన్నతల్లి ప్రతిపక్షాలను ప్రశ్నించారు. గత టీడీపీ ప్రభుత్వంలో మహిళలపై జరిగిన దౌర్జన్యాలు, దురాఘతాలను గుర్తు చేసారు. గీతాంజలి మృతికి కారణమైన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని కోరారు.

గుమ్మిడిగెడ్డ రిజర్వాయర్ పనులు చేపట్టాలి

గుమ్మలక్ష్మీపురం: కురుపాం మండలంలోని గుమ్మిడిగెడ్డ వద్ద మినీ రిజర్వాయర్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని సీపీఎం నాయకులు మండంగి రమణ, కోలక అవినాష్‌లు డిమాండ్ చేశారు. మండలంలోని బొడ్డగూడ గ్రామంలో సీపీఎం నాయకులతో కలిసి మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుమ్మిడిగెడ్డ వద్ద మినీ రిజర్వాయర్ నిర్మిస్తే కురుపాం, కొమరాడ, జియ్యమ్మవలస, గరుగుబిల్లి మండలాలకు చెందిన సుమారు 10వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఈ రిజర్వాయర్ నిర్మాణ పనులు ప్రారంభించాలన్న డిమాండ్‌తో త్వరలో రైతులతో కలిసి నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. సీపీఎం నాయకులు కొల్లి గంగునాయుడు, ఎం.శ్రీనివాసరావు ఉన్నారు.

పేదల సొంతింటి కల సాకారం

- ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

గరుగుబిల్లి: నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని రావుపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజుతో కలిసి మంగళవారం పలువురు లబ్ధిదారులకు డి-పట్టాలు, ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో 145 మందికి 35 ఎకరాలకు సంబంధించి డి-పట్టాలను, 88 మంది ఇంటి పట్టాలను అందించడం జరిగిందన్నారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. అందరి అవసరాలు తెలుసుకొని పథకాలను అమలు చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మనమంతా ఆశీర్వదించి మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం పట్టాలు పొందిన లబ్ధిదారులతో కలిసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఎంపీపీ ఉరిటి రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, స్థానిక సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు, ఎంపీటీసీ సదానందం, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.


పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

- జగనన్న వెంట నడుద్దాం
- మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దాం
- చేయూత సభలో పాలకొండ ఎమ్మెల్యే కళావతి


సీతంపేట: సమావేశానికి హాజరైన మహిళలు


పాలకొండ రూరల్: చేయూత చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

సీతంపేట: వైఎస్సార్ చేయూత పథకం ద్వారా అందజేస్తున్న పెట్టుబడి సొమ్ముతో మహిళలు సొంతంగా పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. వైఎస్సార్ చేయూత పథకంలో 4,374 మందికి రూ.8.20 కోట్లు నమూన చెక్కును స్థానిక ఐటీడీఏ గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల రూపంలో నేరవేర్చరన్నారు. వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలన స్వర్ణయుగమన్నారు. మనందరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట నడిచి మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దాం అన్నారు. ప్రతీ మహిళా ఆర్థికంగా బలపడాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రవర్ణ పేదింటి అక్క చెల్లెమ్మల కోసం దాదాపు 32 పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అవినీతికి తావులేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మహిళలు జై జగన్, జైజై జగన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, ఎంపీడీఓ గీతాంజలి, జెడ్పీటీసీ ఎస్.లక్ష్మి, ఏఎంసీ చైర్మన్ హెచ్.మోహన్‌రావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎస్.లక్ష్మి, ఈఓపీఆర్‌డీ సత్యం, వెలుగు సిబ్బంది, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి హృదయంలో జగనన్నకు సుస్థిర స్థానం

పాలకొండ రూరల్: రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అమలు చేసిన సంక్షేమ పథకాల ఫలితమే ప్రతి హృదయంలో జగనన్నకు సుస్థిర స్థానం కల్పించిందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. పాలకొండ ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో వైఎస్సార్ చేయూత నాల్గవ విడత కార్యక్రమం సందడి వాతావరణంలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ గత ప్రభుత్వాలతో పోల్చుకుంటే జగనన్న ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడిందన్నారు. చేయుత పథకం ద్వారా మండలంలో నాలుగవ విడతలో 4156 మందికి రూ.7,79,25,000 మహిళల ఖాతాలకు జమ చేయటం జరిగిందన్నారు. ఎంపీపీ బొమ్మాళి భాను, వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్, వాకముడి అనీల్‌కుమార్, బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నల్లి శివప్రసాద్ తదితరులు మాట్లాడారు. ఎంఎంఎస్ అధ్యక్షురాలు కనుముల కల్పన, ఎంపీడీఓ ఎస్.రామక్రిష్ణ, వైకేపీ ఏపీఎం ఎం.సూరమ్మ, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. లబ్ధి పొందిన అర్హులైన మహిళలు, సంఘాల సభ్యులు జగనన్న పాటలకు నృత్యాలు చేశారు. వీరితోపాటు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు కూడా తమ పాదం కలపడంతో సభా ప్రాంగణంలో జగనన్న నినాదాలు మిన్నంటాయి.